సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



**ఇదేం పరీక్ష!**
జిల్లాలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించక పోవడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. వివరాలు 8లో ▸



**'అన్నదాత సుఖీభవ'**
మాట్లాడే పెదవులకన్నా, సహాయం చేసే చేతులు మిన్నా అన్నారు పెద్దలు. ఇది అక్షరాల నిజం చేయాలని భావించారు తోట వంశ కుటుంబ సభ్యులు. వివరాలు 8లో ▸



**అధ్వానంగా రహదారులు**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### మంజీరా బ్యాక్‌వాటర్ కాల్వల పరిశీలన



మంజీరా బ్యాక్ వాటర్ కాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు

**నారాయణఖేడ్:** మంజీరా బ్యాక్ వాటర్ ప్రవహించే కాల్వలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారి విఠల్‌రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. మంజీరా బ్యాక్ వాటర్‌ను వ్యవసాయానికి వినియోగిస్తే అనేక మంది రైతులకు ప్రయోజనం చేకూరుతోందని, అందువల్ల క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రాజెక్టు రూపకల్పన కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### సింగూరుకు పెరిగిన వరద

**పుల్‌కల్(అందోల్):** సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో ఒక గేటును ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. వారం రోజుల నుంచి ప్రవాహం తగ్గడంతో గేట్లన్నింటినీ మూసివేశారు. సోమవారం ప్రాజెక్టులోకి భారీగా ప్రవాహం చేరింది. దీంతో ఆరో నంబర్ గేటును రెండు మీటర్ల ఎత్తు ఎత్తి 13,471 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రం ద్వారా 2,800 క్యూసెక్కులను వదులుతున్న జెన్‌కో అధికారులు రెండు టర్బయిన్‌లతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి నీటి మట్టం 29.9 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగతావి దిగువకు విడుదల చేస్తున్నారు.

### రేపు జిల్లా స్థాయి జట్ల ఎంపిక

**సంగారెడ్డి ఎడ్యుకేషన్:** ఉమ్మడి మెదక్ జిల్లా జూనియర్ కళాశాలల ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు ఈ నెల 23వ తేదీన అండర్ 19 విభాగంలో కరాటే, తైక్వాండ్ పోటీలలో ఎంపిక జరగనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సదాశివపేటలోని విజ్ఞాన్ మోడల్ హైస్కూల్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పదో తరగతి మెమో, బోనఫైడ్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8106841226, 9848578970ను సంప్రదించాలని కోరారు.

### స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలి

డీఈఈ సాబేర్ హుస్సేన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఈ

**న్యాల్‌కల్(జహీరాబాద్):** గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలని జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సాబేర్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో తాగు నీటి సరఫరాపై గ్రామ పంచాయతీ సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగు నీటి సరఫరా జరుగుతోందని, నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత గ్రామ సహాయకులపై ఉందన్నారు. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్, ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.

### గ్రామస్థాయి పర్యటన ఎంతో మేలు: కలెక్టర్

ట్రైనీ కలెక్టర్లకు ఘనస్వాగతం

**మెదక్‌జోన్:** ఆలిండియా సర్వీసెస్ అధికారుల శిక్షణలో భాగంగా గ్రామస్థాయి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లాలో ఎనిమిది రోజుల పర్యటన నిమిత్తం 26 మంది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సోమవారం కలెక్టర్‌ను కలిసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వారితో రాహుల్‌రాజ్ మాట్లాడారు. ఈనెల 21 నుంచి 28 వరకు మొదటి ఐదు రోజులు గ్రామస్థాయిలో, చివరి మూడు రోజులు అర్బన్ ఏరియాలలో పర్యటిస్తారన్నారు. జిల్లాలోని మనోరాబాద్ మండలం, కూచారం, తూప్రాన్ మండలంలో మల్కాపూర్, నర్సాపూర్ పరిధిలోని అవెంచ, రామాయంపేట పరిధిలోని డి.ధర్మారం గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలపై అవగాహన కోసమే జిల్లాకు వచ్చారన్నారు. కార్యక్రమంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ శంకర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, ట్రైనీ ఐఏఎస్‌లు పాల్గొన్నారు.



అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్, అమరుల కుటుంబ సభ్యులు

# అమరుల త్యాగాలు చిరస్మరణీయం

**ఎస్పీ చెన్నూరి రూపేష్**
- పోలీసు అమరులకు ఘన నివాళులు
- పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ తదితరులు

**సంగారెడ్డి జోన్:** విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. పోలీసుల అమరవీరుల దినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ క్రాంతితో కలసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుల సేవలను వెలకట్టలేమన్నారు. అమరుల ప్రాణ త్యాగంతోనే నేడు మనం స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని, పోలీసు అమరుల కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ.. ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా పోలీసు శాఖ ఎదురు నిలబడి, పోరాడుతోందని గుర్తు చేశారు. కాగా, అనంతరం అమరుల కుటుంబాల సమస్యలను ఎస్పీ రూపేష్ అడిగి తెలుసుకున్నారు. వారికి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్య గౌడ్, రామ్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

# ఒక్కో పనికి ఒక్కో రేటు!

- వినియోగదారున్ని బట్టి ముడుపుల వసూళ్లు
- ప్యానల్‌బోర్డు, కొత్త కనెక్షన్.. ఇలా పనిని బట్టి రేట్లు
- ముడుపులివ్వకపోతే మూడినట్లే..
- విద్యుత్‌శాఖలో దర్జాగా వసూళ్ల దందా

**సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి:** విద్యుత్‌శాఖ వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్సీ)లో కాసుల వేట కొనసాగుతోంది. వివిధ పనుల కోసం ఈ కేంద్రాలకు వచ్చిన వినియోగదారులను ఇక్కడ నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన నిర్ణీత మొత్తాని కంటే రెండు, మూడు రెట్లు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి వినియోగదారున్ని బట్టి వసూళ్ల దందా పరిపాటిగా తయారైంది.

**ప్యానల్‌బోర్డు కావాలంటే..**
ఇంటికి గానీ, అపార్టుమెంట్‌కు గానీ నాలుగు కంటే ఎక్కువ విద్యుత్ కనెక్షన్లు ఉంటే తప్పనిసరిగా ప్యానల్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్యానల్ బోర్డును ఏర్పాటు చేయాలంటే డిస్కంకు చెల్లించాల్సిన మొత్తానికి అదనంగా కనీసం రూ.20 వేల నుంచి కనెక్షన్ల సంఖ్యను బట్టి రూ.50 వేల వరకు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే ఎక్కడైన కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం వెళితే డిస్కంకు చెల్లించాల్సిన మొత్తం కంటే కనీసం రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకు అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కావాలంటే కూడా రూ.పది వేల నుంచి రూ.20 వేల వరకు ఎక్కువే ఇవ్వాల్సింది. ఇలా ప్రతి పనికీ అదనంగా ఇవ్వనిదే పని జరగడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ పేరు మార్పిడి, క్యాటగిరీ మార్పు, మీటరు కాలిపోతే కొత్త మీటరు బిగింపు, మీటర్ టెస్టింగ్, అడ్రస్ మార్పులు, లైన్‌షిఫ్టింగ్, హెచ్‌టీ మీటర్ల తొలగింపు ఇలాంటి పనులు వినియోగదారుల సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.



పటాన్‌చెరు విద్యుత్ వినియోగదారుల సేవాకేంద్రం

**వసూళ్ల పర్వం ఇలా..**
నిబంధనల ప్రకారం ఆయా పనుల కోసం ఈ కేంద్రాలకు వెళితే సంబంధిత దరఖాస్తు ఫారం నింపి, ఆ పనికి నిర్ణీత మొత్తాన్ని డీడీ రూపంలో గానీ, ఆన్‌లైన్‌లో గానీ చెల్లించి డిస్కంకు చెల్లించాలి. కానీ ఈ కేంద్రాల్లో ఇందుకు విరుద్ధంగా వ్యవహారం నడుస్తోంది. ఆయా పని కోసం వినియోగదారులు వెళితే అక్కడి సిబ్బంది బేరం మాట్లాడేస్తున్నారు. అన్నీ మేమే చూసుకుంటామని గంప గుత్తాగా డబ్బులు మాట్లాడుకుంటున్నారు. ఆ మొత్తాన్ని ఇస్తే చాలు డిస్కంకు చెల్లించాల్సిన మొత్తాన్ని తామే చెల్లించి పని చేసి పెడతామని చెప్పి పంపుతున్నారు. కాస్త పెద్ద పని అయితే వెళ్లి ఇంజనీరింగ్ అధికారిని కలవాలని పురమాయిస్తున్నారు. సదరు అధికారి వద్దకు వెళ్లి గంప గుత్తాగా మాట్లాడుకుంటే ఆ దరఖాస్తు ఫారంపై ముందుకు కదులుతుంది. లేని పక్షంలో ఆ దరఖాస్తు నెలలు గడుస్తున్నా ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.

**పటాన్‌చెరు, సంగారెడ్డిల్లో మరీ దారుణం**
విద్యుత్‌శాఖ వినియోగదారుల సౌకర్యం కోసం జిల్లా వ్యాప్తంగా 11 చోట్ల ఈ కన్జూమర్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వివిధ పనుల కోసం ప్రతి నెలా ఈ కేంద్రాలకు సుమారు 2 వేల నుంచి 3 వేల దరఖాస్తులు వస్తుంటాయి. అత్యధికంగా పటాన్‌చెరు కేంద్రానికి నెలకు సుమారు 600 నుంచి 800 వరకు దరఖాస్తులు వస్తాయి. ఇస్నాపూర్, సంగారెడ్డి కేంద్రాలకు కూడా 300 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. దీంతో ప్రతినెలా ఈ కేంద్రాల్లో రూ.లక్షల్లో ముడుపులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**ముడుపులు ఇవ్వకపోతే తిప్పడే..**

ఎవరైనా వినియోగదారులు ముడుపులు ఇవ్వని పక్షంలో ఆ దరఖాస్తు ముందుకు కదలదు. చెప్పులరిగేలా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి తీసుకువస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అసలే ఉరుకులు.. పరుగుల జీవితంలో అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగలేని వారు అడిగినంత ఇచ్చుకుని పనులు చేయించుకుంటున్నారు. ఇలాంటి వినియోగదారుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని అందిన కాడికి దండుకుంటున్నారు.

**మా దృష్టికి వస్తే చర్యలు**

కన్జుమర్ సర్వీస్ సెంటర్లలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు మా దృష్టిలో లేదు. ఎవరైనా వినియోగదారులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. అలాంటి ఆరోపణలుంటే సంబంధిత ఏడీలతో మాట్లాడి వివరణ తీసుకోండి. కస్టమర్ సర్వీస్ సెంటర్లలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నాం. నెల రోజుల్లో రెండు సార్లు సమీక్షించాం.
–శ్రీనాథ్, పర్యవేక్షక ఇంజనీర్, విద్యుత్‌శాఖ

# తాగునీటి ఇబ్బందులుండొద్దు

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**సంగారెడ్డి జోన్:** గ్రామాలలో ప్రజలకు సరఫరా చేసే తాగునీటిలో ఇబ్బందులు ఉండొద్దని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధ మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు.ప్రత్యేక అధికారుల తమ పర్యటనలకు సంబంధించిన నివేదికలు ప్రతి నెల సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో అని పరిశీలించాలన్నారు. పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరగాలని, జిల్లా ప్రతిష్ట కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ప్రతిభ చూపేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

**ప్రణాళిక బద్ధంగా స్వీప్ కార్యక్రమాలు**
ఓటరు జాబితా సవరణలో భాగంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి స్వీప్ కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ముఖ్య కార్యదర్శి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ క్రాంతితో పాటు అధికారులు హాజరయ్యారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ఓటర్లు తమ పేర్లను నవంబర్ 6వ తేదీ లోపు నమోదు చేయాలని అన్నారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. అభ్యంతరాలను, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబర్ 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి, జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించాలని ఆయన ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్ క్రాంతి**

**సంగారెడ్డి జోన్:** ప్రజావాణిలో ప్రజలు అర్జీ చేసుకున్న సమస్యలను వెంటనే పరిష్కరించాని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురితో కలసి ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణికి అధిక సంఖ్యలో అర్జీదారులు రావడంతో మధ్యాహ్నం వరకు కార్యాలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

**భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు: 27వ వార్డు కాలనీ వాసులు**
పట్టణంలోని 27వ వార్డులో రాత్రి ఆరు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు భారీ వాహనాలు తిరగడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. దుమ్ము ధూళి ఇంట్లోకి రావడంతో పాటు పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయి.ఎలాంటి అనుతులు లేకుండా గోదాం నిర్మిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఇళ్ల మధ్యలో ఉన్న గోడౌన్లను ఇతర ప్రదేశాలకు తరలించాలి.

**క్రషర్లతో ఇబ్బందులు పడుతున్నాం: బ్యాతోల్ గ్రామస్తులు**
కంది మండలం బ్యాతోల్ గ్రామంలో ఉన్న ఆరు కంకర క్రషర్లతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. క్రషర్ల బ్లాస్టింగ్‌లతో ఇళ్లు బీటలు వస్తున్నాయి. రోడ్లు ధ్వంసం కావడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. అధిక లోడ్‌తో వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వచ్చే దుమ్ము ధూళితో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని క్రషర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపేయాలి: గీతా నగర్ కాలనీవాసులు**
పట్టణంలోని గీతానగర్ కాలనీవాసుల అనుమతులు లేకుండా కాలనీకి చెందిన వ్యక్తి ఏర్పాటు చేసిన సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలి. టవర్ నిర్మించేందుకు ఇప్పటికే కావాల్సిన సామగ్రిని డంపు చేయించారు. సెల్ టవర్‌తో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



జహీరాబాద్‌ను కప్పేసిన పొంగ మంచు

**కమ్ముకున్న పొగమంచు**

జహీరాబాద్‌లో సోమవారం పొగమంచు కమ్ముకుంది. పొగ కారణంగా రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. ఉదయం పొగమంచు, మధ్యాహ్నం ఎండా వేడిమి, సాయంత్రం వర్షం కురుస్తూ.. ఒకటే రోజు భిన్నవాతావరణం కనిపించింది. – జహీరాబాద్ టౌన్

### పటాన్‌చెరు ఆస్పత్రికి అవార్డు

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మూడు నెలల క్రితం వచ్చిన కేంద్ర బృందం ఆస్పత్రిలో వైద్యసేవలు, నిర్వహణ, పరిశుభ్రత పచ్చదనం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని పరిశీలించింది. జాతీయ నాణ్యతా అసెస్మెంట్ సర్వీసు ఇచ్చిన నివేదిక ఆధారంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి నాణ్యత ధ్రువీకరణ అవార్డును అందించినట్లు సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును త్వరలోనే అందుకోనున్నట్లు చెప్పారు.

# సింగూరు జలాలు జిల్లాకే దక్కాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు**

**సంగారెడ్డి ఎడ్యుకేషన్:** సింగూరు జలాలు జిల్లా ప్రజల హక్కు అని, సాగు, తాగునీరు జిల్లా ప్రజలకే దక్కాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక జిల్లాగా పేరొందినప్పటికీ స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జహీరాబాద్‌లో జరిగిన సీపీఎం మహాసభల్లో 18 తీర్మానాలు చేశామని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు. సంగారెడ్డి వరకు మెట్రో సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వం వివిధ రకాల అభివృద్ధి పేర్లతో పేదల భూములు గుంజుకోవాలని చూస్తుందని ఆరోపించారు. ధరణిలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. అనేక చోట్ల చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయని, వీటిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, జి.సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జయరాజు

# రూ.25.08 కోట్లతో బీటీ రోడ్లు

**మునిపల్లి(అందోల్):** అందోల్ నియోజకవర్గంలోని బీటీ రోడ్ల కోసం రూ.25.08 కోట్లు మంజూరైనట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి తెలిపారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే బీటీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు.

# ఎన్నాళ్లీ నిరీక్షణ!

డీఎస్సీ 2008 అభ్యర్థుల పదహారేళ్ల కల సాకారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల సర్టిఫికెషన్ వెరిఫికేషన్ జరిగింది. ఇక నియామకాలే తరువాయి అన్నట్లు ఉంది. ఇటీవల 2024 డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు, పాఠశాలల కేటాయింపు ప్రక్రియ వల్ల ఆలస్యం అవుతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**2008 డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన**
- 292 మంది అర్హులుగా గుర్తింపు.. 183 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్
- కాంట్రాక్ట్ ఎస్జీటీలుగా నియామకాలు
- 2024 డీఎస్సీ నియామక ప్రక్రియ వల్ల ఆలస్యం

**పాపన్నపేట(మెదక్):** డీఎస్సీ 2008లో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్ట్ సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తాయి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల నుంచి సుమారు 292 మంది అభ్యర్థులను అర్హులుగా గుర్తించారు. 183 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఈ మధ్యే 2024 డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు, పాఠశాలల కేటాయింపు ప్రక్రియ వల్ల.. వారి నియామకాల్లో జాప్యం జరుగుతోంది. దీంతో 16 ఏళ్ల కల సాకారం కోసం వారు ఎదురుచూపులు చూస్తున్నారు.

**16 ఏళ్ల పోరాటానికి ఊరట**
ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించారు. చివరి సమయంలో 30 శాతం ఎస్జీటీ పోస్టులను డీఈడీ పూర్తి చేసిన వారికి కేటాయించారు. దాంతో మార్కుల పరంగా మెరిట్‌లో ఉన్న బీఈడీ అభ్యర్థులు చాలా మంది నష్టపోయారు. అప్పటి నుంచి తమకు ఉద్యోగాలు ఇవ్వాలని వారు పోరాడుతున్నారు. చివరకు న్యాయస్థానాలు సైతం వారికి న్యాయం చేయాలని తీర్పు ఇచ్చాయి. అయినా వారి వేదన అరణ్య రోదనే అయ్యింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు అధికారంలో ఉండటంతో అర్హులైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగం ఇవ్వాలని, నెలకు రూ.31,030ల జీతం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది.





**జిల్లాలో ఎంతమంది అర్హులంటే**
2008 డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులకు ఈ యేడు సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5 వరకు అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగింది. ఉమ్మడి జిల్లాలో 292 మంది అర్హులు ఉంటే 183 మంది హాజరయ్యారు. కాంట్రాక్ట్ విధానంలో నెలకు రూ.31,030 జీతం కావడంతో కొంతమంది సుముఖత చూపనట్లు తెలుస్తుంది. మరి కొంతమంది ఇతర ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సర్టిఫికెట్ పరిశీలన పూర్తయ్యి 16 రోజులు కావస్తున్నా ఇంత వరకు వారికి నియామక పత్రాలు అందలేవు. వెంటనే నియామకాలు చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు.

**ఎన్నాళ్లీ కష్టాలు**



నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన నాకు చిన్నప్పటి నుంచి కష్టాలే. 2008 డీఎస్సీలో ఎస్జీటీ 0.5, స్కూల్ అసిస్టెంట్ 2 మార్కులతో చేజారింది. తర్వాత సీఆర్పీగా పనిచేస్తున్నా. నాకు ఇద్దరు పిల్లలు. వారికి ఇరవై యేళ్ల వయసు ఉంటుంది. ఒక అబ్బాయి వైకల్యంతో బాధ పడుతున్నాడు. కనీసం ఈ కాంట్రాక్ట్ ఎస్జీటీ పోస్టు అయినా తొందరగా ఇస్తే కొంత మేలు చేకూరుతుంది. –ధర్మా, దండువాని కుంట, టేక్మాల్ మండలం

**తదుపరి ఆదేశాల కోసం చూస్తున్నాం**

మాకు అందిన ఆదేశాల మేరకు అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి అయ్యింది. డైరెక్టర్ కార్యాలయం నుంచి తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.
–వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

# ఇదేం పరీక్ష!

జిల్లాలోని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్తున్నారు. గ్రూప్–1, 2, 3 పరీక్షల నేపథ్యంలో నోటిఫికేషన్ విడుదలైన దగ్గర నుంచి ఆయా గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ఉన్నత ఉద్యోగం సాధించే లక్ష్యంతో లాంగ్ లీవ్ పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో పరిపాలన అస్తవ్యస్తంగా నడుస్తుంది. ఇక్కడ కార్యదర్శి సెలవు పెడితే మరో గ్రామ కార్యదర్శికి బాధ్యతలు అప్పగించడంతో పని భారం ఎక్కువైతుంది. ఏ గ్రామంలోనూ సరిగా విధులకు న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

– హుస్నాబాద్‌రూరల్:


గాంధీనగర్ పంచాయతీ కార్యాలయం

**సెలవుల్లో పంచాయతీ కార్యదర్శులు**
- గ్రూప్స్ ఎగ్జామ్ పేరుతో లాంగ్ లీవ్
- జిల్లాలో విధులకు దూరంగా 15 మంది
- మరో 50మంది ప్రభుత్వానికి దరఖాస్తులు
- ఉన్నతాధికారులకు తప్పని తలనొప్పి
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి

జిల్లాలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేకాధికారులకు వారి శాఖల పనులతో పాటు పంచాయతీల బాధ్యతలను నిర్వహించడం తలకు మించిన భారంగా మారింది. ఈ క్రమంలో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తూ గ్రామాలకు సరిగా రావడం లేదు. ఈ భారమంతా పంచాయతీ కార్యదర్శుల పై పడుతుంది. ప్రభుత్వం మారడం అధికార పార్టీ నాయకులు కార్యదర్శుల పై ఒత్తిడి చేయడం వంటి సమస్యలతో కార్యదర్శులు విధులు నిర్వహించలేక సెలవుల్లోకి వెళ్తున్నారు.

**గ్రూప్స్ పరీక్షల సాకుతో సెలవులు..**
జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. గ్రామ పరిపాలన, ప్రజల సమస్యలు, గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం పనులు చేయడానికి నిధులు లేక సొంత డబ్బులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కొక్క కార్యదర్శికి సమీప గ్రామాల ఇన్‌చార్జి బాధ్యతలను ఇవ్వడంతో రెండు గ్రామాల సమస్యలు కార్యదర్శులకు భారమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితల తయారీ, ఎల్‌ఆర్‌ఎస్ క్షేత్ర స్థాయి విచారణ పనులు కార్యదర్శులకు ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో గ్రూప్స్ పరీక్షల కోసం నోటిఫికేషన్ విడుదల కావడంతో ఉన్నత ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పంచాయతీ కార్యదర్శులు సెలవులు పెడుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రూప్ 1 పరీక్ష కోసం 10 మంది పంచాయతీ కార్యదర్శులు సెలవు పెట్టారు. అలాగే హుస్నాబాద్‌లో ఐదుగురు కార్యదర్శులు గ్రూప్ 2, 3 పరీక్షల పేరుతో సెలవు పెట్టి విధులకు హాజరు కావడం లేదు. మరో 50 మంది సెలవుల కోసం జిల్లా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఇందిరమ్మ కమిటీల ఊసే లేదు**
ప్రభుత్వం పేదలకు పక్కా ఇంటిని నిర్మించాలని దానికి పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం అందించాలనే ఆలోచనతో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. కానీ గ్రామాల్లో సర్పంచ్‌లు లేరు. అధికార పార్టీ నాయకులు పంచాయతీ కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు సహకారం అందించకపోవడంతో ఇప్పటికీ ఇందిరమ్మ కమిటీలు కొల్కిరాలేదు. గ్రామాల్లో ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి సమాచారం ఇవ్వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సెలవుల్లో ఐదుగురు వెళ్లారు**



హుస్నాబాద్ మండలంలో ఐదుగురు పంచాయతీ కార్యదర్శులు సెలవు పెట్టి వెళ్లారు. ఇప్పటికే సెలవుల్లో వెళ్లిన వారు సైతం తిరిగిరాకపోవడంతో ఆయా గ్రామాల బాధ్యతలను మరొకరికి ఇన్‌చార్జిగా అప్పగించాం. రెండు గ్రామాల బాధ్యతలను ఒకరే నెలల తరబడి చూడాలంటే కష్టంగానే ఉంటుంది. సెలవు ఎందుకంటే గ్రూపు పరీక్షలు ఉన్నాయని సమాధానం ఇస్తున్నారు. కార్యదర్శుల సెలవులపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్

# అప్పుల బాధతో ఇద్దరు బలవన్మరణం


రమేశ్ (ఫైల్)


లింగం చారి(ఫైల్)

**పాపన్నపేట(మెదక్):** అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని పాత లింగాయపల్లి సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కమ్మరి లింగం చారి(36) హైద్రాబాద్‌లో మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కొన్ని నెలలుగా పని చేయకుండా ఉంటూ ఇటీవల దసరా పండుగకు గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో నిత్యం అప్పులు ఎక్కువై కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురైన లింగం సోమవారం ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి అన్న సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**నార్లాపూర్ గ్రామంలో..**
**నిజాంపేట(మెదక్):** ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజాంపేట మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన బోయిని రమేశ్(35) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అప్పులు ఎక్కువ అయ్యాయని నిత్యం బాధపడుతుండేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి కల్వకుంట, తిప్పన్నగుల్ల గ్రామ శివారులో రోడ్డు పక్కన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# కత్తులతో గొంతుకోసి, కడుపులో పొడిచి

- యువకుడి దారుణ హత్య
- పాత కక్షలతోనే చంపారని ముగ్గురిపై అనుమానం!
- సదాశివపేట పట్టణంలో ఘటన


అనిల్‌రాజ్(ఫైల్)

**సదాశివపేట(సంగారెడ్డి):** యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని 7వ వార్డు సిద్దాపూర్ ఎస్సీ కాలనీలో అనిల్‌రాజ్(27) తల్లి ధనలక్ష్మి, భార్యాపిల్లలతో కలిసి ఉంటూ మరుగుదొడ్లను శుభ్రపరచడం, సెప్టిక్ ట్యాంక్ వాహనానికి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులతో కలిసి ఆదివారం అర్ధరాత్రి వరకు సిద్దాపూర్ కాలనీలో మద్యం సేవించారు. అనంతరం సోమవారం ఉదయం 8 గంటలకు ప్రభుత్వం అటవీశాఖ నర్సరీలో ఓ యువకుడి మృతదేహం రక్తం మడుగులో పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మహేశ్‌గౌడ్ సిబ్బందితో చేరుకొని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో గొంతుకోసి కడుపులో పొడిచి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి తల్లి ధనలక్ష్మి తన కుమారుడు అనిల్‌రాజ్‌ను కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేశా రు. పాత కక్షలతోనే హత్య చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ, మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# చేప పిల్లల పంపిణీలో కోత సరికాదు

- మత్స్యకారులకు తీవ్ర అన్యాయం
- సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

**సిద్దిపేటజోన్:** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీలో కోత విధించడం సరికాదని, గత ప్రభుత్వం తరహాలో వంద శాతం పంపిణీ చేయాలని మత్స్య కారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చెరువుల్లో, కుంటల్లో వేయడానికి గతేడాది పంపిణీ చేసిన చేప పిల్లల సంఖ్యలో సగం మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిబంధనలు విధించడం సరికాదన్నారు. దీని వల్ల చేప పిల్లల మీద ఆధారపడిన సంఘాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచన చేయాలని, గతేడాది తరహాలో పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధన మేరకు లక్ష చేప పిల్లలను ఉచితంగా పొందిన చెరువులకు ఈసారి 50 వేల చేప పిల్లలు మాత్రమే పంపిణీ చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ముదిరాజ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

**తొగుట(దుబ్బాక):** పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్ద మాసాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమాసాన్‌పల్లి వడ్డెర కాలనీకి చెందిన బోదాసు లక్ష్మి (54), మల్లయ్య దంపతులు కంకర రాళ్లు కొడుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం ఇద్దరూ ఎల్లారెడ్డిపేట శివారులో రాళ్లు కొట్టడానికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో ఇద్దరూ దగ్గరలోని ఓ చింత చెట్టు వద్దకు వెళ్లి నిలుచున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడి తీవ్ర గాయాలతో లక్ష్మి మృతి చెందింది. కళ్లెదుటే భార్యా చనిపోవడంతో భర్త మల్లయ్య బోరున విలపించిన తీరు పలువురి చేత కంట తడి పెట్టించింది. భర్త ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు కేసు నమోదు చేశారు.

**శాలిపేట శివారులో ఏడు మేకలు**
**హవేళిఘణాపూర్(మెదక్):** పిడుగుపాటుకు మేకలు మృతి చెందిన ఘటన హవేళిఘణాపూర్ మండల పరిధిలోని శాలిపేట శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎల్లవ్వ, మరికొందరు వలసొచ్చి సీజ్‌లో మేకలతో తిరుగుతూ వేర్వేరు ప్రాంతాల్లో మేపుతుంటారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం మేకలను డీసీఎంలో తీసుకొచ్చి శాలిపేట శివారులో మేపుతుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మేకలన్నీ ఓ చెట్టు కిందకు చేరగా అకస్మాత్తుగా పిడుగుపడి అక్కడే ఏడు మేకలు మృత్యువాతపడ్డాయి. ఉపాధి కోసం వచ్చి న మేకలు మృతి చెందడంతో యజమానురాలు బోరున విలపించారు. దాదాపు రూ.45 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు.


ఘటనా స్థలంలో మేకలు

# 20 రోజుల పసిగుడ్డు అమ్మకానికి..

- కన్న పేగు బంధాన్ని బేరం పెట్టిన తల్లి
- పట్టుకున్న అధికారులు.. శిశు గృహానికి తరలింపు


తల్లీబిడ్డతో బాలల పరిరక్షణ అధికారులు

**దుబ్బాకటౌన్:** ఓ కన్నతల్లి పేగు బంధాన్ని విక్రయానికి పెట్టింది.ఈ హృదయ విదారక ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామ అటవీ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. శిశు గృహ అధికారి రాజారాం తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లె పహాడ్ గ్రామానికి చెందిన పోతుల రూప 20 రోజుల శిశువును అమ్మకానికి పెట్టింది. గుర్తు తెలియని వ్యక్తులు గజ్వేల్ మార్కెట్ యార్డులో నుంచి ఇందుప్రియాల్ గ్రామం అటవీ ప్రాంతంలోకి వచ్చారు. వారిలో ముగ్గురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు. కొనుగోలుదారులు, మధ్యవర్తుల మధ్య బేరంలో సఖ్యత కుదరకపోవడంతో వివాదం చెలరేగింది. అడవిలో గొర్రెల కాపరులు వీరి గొడవను గమనించి సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీయడంతో వారు అక్కడ నుంచి పరారయ్యారు. వెంటనే మేకల కాపరులు తల్లి బిడ్డను ఇంటికి చేర్చడానికి ఆటో ఎక్కించారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో వెంటనే వారు స్థానిక అంగన్వాడీ టీచరు ఉమర్ సుల్తానకు సమాచారం అందించడంతో ఆమె అక్కడికి చేరుకొని తల్లి బిడ్డలను అంగన్వాడీ సెంటర్‌కు తీసుకొచ్చింది. బాలల పరిరక్షణ అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కేంద్రానికి చేరుకుని తల్లి బిడ్డలను సిద్దిపేట శిశు గృహానికి తరలించారు. శిశువు ఆరోగ్య పరిస్థితి పరీక్షించిన తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపట్టి శిశువును తల్లి రూపకు అప్పజెప్పడమా లేదా శిశు గృహంలో ఉంచడమా నిర్ణయిస్తామని అధికారులు తెలిపారు. తల్లి రూప తన బిడ్డను ఎందుకు అమ్మకానికి పెట్టిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తల్లి విచారణకు సహకరించడం లేదని మరిన్ని వివరాలు త్వరలోనే అధికారులు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి కవిత, నర్స్ శ్యామల, ఐసీడీఎస్ సూపర్వైజర్ గిరిజ, అంగన్వాడీ టీచర్ సుల్తాన, మంజుల, సువర్ణ పాల్గొన్నారు.

## ఆలోచన విధానమే ఒత్తిడికి కారణం

– అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


పుస్తకం ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

**సిద్దిపేటరూరల్:** ఒత్తిడి ప్రతీ వారి జీవితంలో భాగమైందని, దానిని జయించాలంటే ప్రతీ ఒక్కరూ మంచి ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. స్ఫూర్తి లయన్స్ క్లబ్ సిద్దిపేట ఆధ్వర్యంలో ప్రతీయేటా నిర్వహించే మానసిక ఆరోగ్య వారోత్సవాలను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల సిబ్బందికి 'మానసిక ఆరోగ్యం – ఒత్తిడిని జయించడం ఎలా' అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ మామిడాల శ్రీనివాస్‌తో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఒత్తిడితో చేసే పనిలో నాణ్యత లోపించడం, వ్యక్తిగత కుటుంబ, ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేస్తుందన్నారు. ఒత్తిడి కలగడానికి మన ఆలోచన విధానమే ప్రధాన కారణమని, తప్పుడు ఆలోచన విధానాన్ని మార్చుకొని, మంచి ఆహారం, నిద్ర, యోగ, ప్రాణయామం ద్వారా ఒత్తిడిని జయించొచ్చన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, స్ఫూర్తి లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మామిడాల సత్యానందం, అధికారులు పాల్గొన్నారు.

# మతి స్థిమితం లేని యువకుడు వీరంగం


ధ్వంసమైన ప్రచారం రథం


అద్దాలు పగిలిపోయిన ఆటో

**వాహనాలు, వీధి దీపాల స్టార్టర్ డబ్బాలు ధ్వంసం**

**దుబ్బాకటౌన్:** దుబ్బాక మండలంలోని శిలాజీనగర్ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు ఆదివారం అర్ధరాత్రి పట్టణ శివారులో వీరంగం సృష్టించాడు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు క్యాంపు కార్యాలయం బయట నిలిపి ఉంచిన బీజేపీ ప్రచార రథం వాహనం అద్దాలను ధ్వంసం చేశాడు. అలాగే పట్టణంలోని బస్టాండ్ వెనుక రహదారిలో నిలిపి ఉంచిన ఆటో, అంబులెన్స్, మరో వాహనం అద్దాలను ధ్వంసం చేయడంతోపాటు అక్కడి వీధి దీపాల స్టార్టర్ డబ్బాలను పగులగొట్టాడు. కొన్ని సీసీ కెమెరా వైర్లను తెంపేశాడు. సోమవారం ఉదయం స్థానికుల సమాచారం పోలీసులు ధ్వంసమైన వాటిని పరిశీలించారు. ప్రస్తుతం ఆ యువకుడి పై ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


బాలకిష్టయ్య(ఫైల్)

**బెజ్జంకి(సిద్దిపేట):** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తోటపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బొనగిరి మనోజ్ (25)తోపాటు మంచిర్యాల జిల్లా కొత్తగూడెంకు చెందిన జాన్ అన్విత్ కరీంనగర్‌లో రూం అద్దెకు తీసుకొని పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపైన ఇద్దరూ బెజ్జంకి వైపునకు వస్తుండగా తోటపల్లి వద్ద కల్వర్టు రేలింగ్‌కు అతి వేగంగా ఢీకొట్టారు. ఈ క్రమంలో మనోజ్‌కు తీవ్ర గాయాలై మృతి చెందగా, అన్విత్‌కు స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు.

**మద్యం తాగి కూలీ..**
**రామచంద్రాపురం(పటాన్‌చెరు) :** మద్యం తాగి కూలీ మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన ఉత్తమ్ సహా(45) జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల కిందట తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం లేబర్ క్యాంప్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. సోమవారం మద్యం దుకాణం వద్ద తాగుతూనే కిందపడిపోయాడు. వెంటనే 108కి సమాచారం అందించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

**బైకును ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి..**
**దుబ్బాకరూరల్:** ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన జంగిటి బాలకిష్టయ్య (65) వ్యవసాయ పొలం వద్ద నుంచి బండిపై బల్వంతాపూర్ వైపు వస్తున్నాడు. ఇదే సమయంలో దుబ్బాక వైపు నుంచి ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

**చెరువులో మునిగి రైతు..**
**దౌల్తాబాద్(దుబ్బాక):** చెరువులో మునిగి రైతు మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన రాఘవుల చంద్రం (50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పంటకు తన బోరు ద్వారా నీళ్లు సరిపోకపోవడంతో పక్కనే ఉన్న చెరువులో నుంచి బోరు మోటార్ ద్వారా పొలానికి సాగునీరు పెట్టుకుంటున్నాడు. ప్రస్తుతం కోత దశకు చేరుకోవడంతో నీళ్లు నిలిపివేద్దామని చెరువులోని బోరు మోటార్‌ను తీయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.

# 'అన్నదాత సుఖీభవ'

**నిజం చేస్తున్న తోట వంశ కుటుంబ సభ్యులు**
- సదాశివపేటలోని పెద్దమఠంలో ప్రతి రోజూ అన్నదానం
- 17 నెలలుగా అభాగ్యులకు భోజనం
- అవ్వతాతలు, అమ్మానాన్నల జ్ఞాపకార్థం పలువురికి సాయం
- నెలకు రూ.1.30 లక్షలు ఖర్చు

**సదాశివపేట(సంగారెడ్డి):** మాట్లాడే పెదవులకన్నా, సహాయం చేసే చేతులు మిన్నా అన్నారు పెద్దలు. ఇది అక్షరాల నిజం చేయాలని భావించారు తోట వంశ కుటుంబ సభ్యులు. తమ సంపాదనలో ఎంతో కొంత పేదలకు సాయం చేసి ఆపదలో ఉన్నవారికి తనవంతు చేయూత అందించాలని నిశ్చయించుకున్నారు. అన్నం కోసం అలమటించే అభాగ్యులకు హక్కున చేర్చుకొని వారికి కడుపునింపుతున్నారు. పెద్ద మనసుతో ఆలోచించి పట్టణంలో ఎందరో వృద్ధులు, అనాధలు, నిరాధరణకు గురై ఆకలితో అలమటిస్తున్న పండుటాకులకు భోజనం పెడుతున్నారు ఈ తోట వంశ కుటుంబీకులు.

**నాణ్యమైన భోజనం**
పట్టణానికి చెందిన తోట వంశ కుటుంబ సభ్యులు తమ తల్లిదండ్రులు, అవ్వాతాతలు తోట శరణమ్మ–సదాశివుడుపటేల్, తోట మాణిక్యమ్మ– శంకరప్ప పటేల్ గార్ల జ్ఞాపకార్థం తనకు వచ్చే సంపాదనతో వృద్ధులు, వికలాంగులు, అనాధలకు ఏదో ఒకటి చేయాలని భావించారు. రహదారులు, బస్టాండ్ ఇతర ప్రాంతాల్లో అన్నం కోసం పడుతున్న తపన కొందరిని చూసి చలించిపోయారు. దీంతో నిత్యం అన్నదానం చేయాలని నిర్ణయించుకున్నారు. పట్టణంలోని పెద్దమఠంలో 2023 జూలై నుంచి నిత్య అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ప్రారంభంలో కొద్దిమందితో మొదలైన అన్నదాన కార్యక్రమం ఇప్పుడు 150 వరకు చేరింది. వీరికి ప్రతి రోజూ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు మంచి రుచికరమైన నాణ్యమైన భోజనం అందిస్తారు. 17 నెలలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతీ నెలా 1.30 లక్షల వ్యయంతో అన్నదానం నిర్వహిస్తున్నారు.


అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు


క్యూలో నిలుచున్న అభాగ్యులు

**మా వంతు సాయం చేయాలనే..**



వృద్ధులు, వికలాంగులు, అనాథలుగా ఆకలితో అలమటిస్తున్న వారికి సేవ చేయడం ఆనందంగా ఉంది. వారి బాధలను చూసి మా వంతుగా ఏదైనా సాయం చేయాలనే లక్ష్యంతో తోట వంశ కుటుంబ సభ్యులు అన్నదానం చేయడం గొప్ప విషయం. తోట కుటుంబీకుల ఫ్యామిలీ ఫ్రెండ్ అయిన నేను 17 నెలల నుంచి వాలంటీర్‌గా సేవలందిస్తున్నాను.

– శ్రీధర్ వాలంటీర్ సదాశివపేట

**రోజూ వచ్చి తింటాం**



పట్టణంలో ఏ పని దొరికితే ఆ పని చేస్తా. కూలీ పనులకు వెళ్లినా వెళ్లకున్నా ప్రతి రోజూ మధ్యాహ్నం ఇక్కడికి వచ్చి తాను, మా అక్క ఇద్దరం భోజనం చేస్తాం. మా అక్క వితంతు పింఛన్ వస్తున్నా మందులు ఇతర అవసరాలకు వాడుకుంటుంది. నిత్య అన్నదానం ప్రారంభమైన నాటి నుంచి ఆకలి కాగానే పెద్దమఠం గుర్తుకొస్తుంది. నిత్యం 100 నుంచి 150 మంది వరకు వచ్చి భోజనం చేసి వెళ్తాం అందరం వారికి రుణపడి ఉంటాం.

– భూమమ్మ కూలీ సదాశివపేట

## క్లుప్తంగా

**రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక**


ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**కల్హేర్(నారాయణఖేడ్):** మండలంలోని కృష్ణాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్ 18 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం సుధాకర్, పీఈటీ రాములు యాదవ్ సోమవారం తెలిపారు. నర్సాపూర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి 43వ జూనియర్ ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు జీ.సంయుక్త, పూజ, వసంత, హర్షిత అత్యంత ప్రతిభ కనబర్చారని అన్నారు. 28 నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థిని ఆర్.సోనా ఎస్‌జీఎఫ్ అండర్ 14 పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

**అందె భాస్కర్‌కు పితృ వియోగం**
**మిరుదొడ్డి(దుబ్బాక):** మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తండ్రి అందె డప్పు బాలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. బాలయ్య 1980 దశకంలో రైతు కూలీ సంఘం నాయకుడిగా, మానవ హక్కుల కోసం బీడీ కార్మికుల ఉద్యమాల్లో పాల్గొని పోలీస్ నిర్బంధాలను సైతం ఎదుర్కొన్నారు. అంత్యక్రియలు గ్రామంలోనే సోమవారం ముగిశాయి. అంత్యక్రియల్లో జనశక్తి పార్టీ మాజీ కార్యదర్శి అమర్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గద్దం సమ్మయ్యతోపాటు పలువురు కవులు, గాయకులు పాల్గొని బాలయ్య పాడెను మోశారు.

**తాళం వేసిన ఇంట్లో చోరీ**
**వర్గల్(గజ్వేల్):** తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన వర్గల్ మండలంలో సోమవారం వెలుగు చూసింది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. అనంతగిరిపల్లికి చెందిన తిమ్మాయిపల్లి మల్లేశ్ గౌడ్ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి గజ్వేల్ వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.70 వేల నగదు, అర తులం బంగారు గొలుసు, 15 తులాల వెండి మాణిక్యాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించామని ఎస్‌ఐ తెలిపారు.

**ప్రమాదవశాత్తు కారు దగ్ధం**


కాలిపోతున్న కారు

**చేగుంట(తూప్రాన్):** ప్రమాదవశాత్తు కారు మంటల్లో దగ్ధమైన ఘటన చేగుంట కన్యక పరమేశ్వరీ ఆలయ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా అందోల్‌కు చెందిన రాఘవేంద్రశర్మ వ్యక్తి గత పని నిమిత్తం చేగుంటలోని రఘురాంశర్మ ఇంటికి కారులో వచ్చాడు. కారును కన్యక పరమేశ్వరీ ఆలయం సమీపంలో పార్కింగ్ చేసి, అందరూ కారు దిగిన అనంతరం అకస్మాత్తుగా కారులో మంటలు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చేలోపే కారు పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.